మన భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

మంగళవారం 29 సెప్టెంబర్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2

ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలి

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికం గానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతా యని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి, రెవిన్యూ కి సంబందించి 52 దరఖాస్తులు, డిపిఓ 5, డిఎం అండ్ హెచ్ ఓ 4, డిడబ్ల్యు ఓ 3, మిగిలిన, 26 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 90 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డి ఇ ఓ అశోక్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యుఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు

వట్టె జానయ్య యాదవ్ జన్మదిన వేడుకలు

భానుపురి /సూర్యాపేట

బీసీ ఉద్యమ నాయకుడు వట్టె జానయ్య యాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వాణిజ్య భవన్ సెంటర్‌లో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. గాంధీనగర్‌లోని స్నేహ నిలయంలో వృద్ధులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కుల, సామాజిక న్యాయం కోసం వట్టె జానయ్య యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న ఉద్యమాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వల్లాల సైదులు యాదవ్, బోల్ల సైదులు యాదవ్, కుంభం నాగరాజు, ఆవుల అంజయ్య, బొల్లం వీరస్వామి యాదవ్, చింత జానయ్య యాదవ్, బాడిగ మల్లేష్ యాదవ్, లింగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేసిన కలెక్టర్

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖలో కారుణ్య నియామకం పేరిట బాధితుల నుంచి భారీగా నగదు డిమాండ్ చేసి, డబ్బులు ముట్టజెప్పిన వేరొకరికి అడ్డదారిలో పోస్టింగ్ కట్టబెట్టిన వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగి ని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. అతడిని తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు, పూర్తి వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖలో వాచ్ మెన్ గా పని చేస్తూ 2023లో గుండె పోటుతో మృతి చెందిన మండపల్లి భరత్ బాబు కొడుకు కారుణ్య నియామకం కింద పోస్టింగ్ ఇవ్వడానికి జూనియర్ అసిస్టెంట్ శ్రీరామ్ కుమార్ డబ్బులు డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం చెల్లించుకోలేక బాధితుడు ఆఫీసు చుట్టునముడేళ్ళుగా తిరుగుతున్న ఆ పోస్టింగ్‌ను తొక్కిపెట్టారు. అదే సమయంలో ఆ పోస్టింగ్ కోసం డిమాండ్ చేసిన మొత్తాన్ని సమర్పించిన వేరొక అభ్యర్థికి పోస్టింగ్ కట్టబెట్టారు. దీని పై బాధితుడు జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించడంతో సిబ్బంది నిర్వాకం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రాథమిక సమాచారాన్ని పరిశీలించిన కలెక్టర్.. జూనియర్ అసిస్టెంట్ శ్రీరామ్‌కు మార్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంలో కేవలం జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నాడా? లేదా వెనుక ఇంకా ఎవరైనా పెద్దల హస్తం

ఉందా? అనే కోణంలో లోతైన దర్యాప్తునకు ప్రత్యేక విచారణకు . అదనపు కలెక్టర్, ఆర్ అండ్ బి సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ), ఆడిట్ ఆఫీసర్లతో కూడిన విచారణ కమిటీని కలెక్టర్ నియమించారు. నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని కలెక్టర్ వారిని ఆదేశించారు.

ముగిసిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

ప్రణమ్ డే కేర్ సెంటర్‌లో 4వ రోజు కార్యక్రమం చాలా విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో "సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత ద వృద్ధులపై వేధింపుల నుండి రక్షణ" అనే ప్రధాన అంశంపై కొనసాగింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ శాఖ జిల్లా సైబర్ వింగ్ సహకారంతో నిర్వహించాయి. డిజిటల్ యుగంలో వృద్ధులు సైబర్ మోసాల బారిన పడకుండా రక్షించడం, వారి భద్రత గౌరవాన్ని కాపాడటం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

-కార్యక్రమంలోని ముఖ్యాంశాలు:

సైబర్ మోసాలపై అవగాహన: ఓటీపీ యూపీఐ ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవల్లో జరిగే మోసాలను గుర్తించడం, డిజిటల్ సేవలను సురక్షితంగా ఎలా వాడాలో సైబర్ వింగ్ అధికారులు వృద్ధులకు వివరించారు. స్మార్ట్‌ఫోన్‌లను బాధ్యతా యుతంగా ఉపయోగించడంపై అవగాహన కల్పించారు వృద్ధులపై వేధింపులు, నిర్లక్ష్యం, దోపిడీకి వ్యతిరేకంగా అందుబాటులో ఉన్న చట్టాలు, ఫిర్యాదుల పరిష్కార వేదికలు, పోలీసు సహాయం డీఎల్ఎస్ఏ ద్వారా లభించే సేవల గురించి సమగ్ర సమాచారం అందించారు.ఈ అవగాహన సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు, సైబర్ వింగ్ పోలీసులు మహేష్,రెడ్ క్రాస్ చైర్మన్ కోటేశ్వర్, మెడికల్ ఆఫీసర్ వాసవి, విద్యాసాగర్ , హమీద్ ఖాన్,గుండా రమేష్ ,వినోద్ కుమార్, ప్రియాంక, డే కేర్ సెంటర్ సౌమ్య ,రజిని పాల్గొన్నారు.

కుక్కడపు సక్కుబాయమ్మ కు నివాళులర్పించిన ఆర్యవైశ్యులు

భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ కుక్కడపు జానకి రామయ్య సతీమణి కుక్కడపు సక్కుబాయమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం పలువురు ఆర్యవైశ్యులు వారి నివాసంలో వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమారుడు కుక్కడపు శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘం నాయకులు బ్రాహ్మణపల్లి మురళీధర్, బండారు రాజా, తప్పీ గాంధీ, యామా ప్రభాకర్, పోతుగంటి వెంకటేశ్వర్లు, కకోట లక్ష్మయ్య, నూకా రవిశంకర్, వెంపటి శబరినాథ్, బ్రాహ్మణపల్లి శివప్రసాద్,ఉరుగంటి రామమూర్తి, తెల్ల ప్రభాకర్ శ్రీ వాసవి రక్షణ కవచం నిర్వాహకులు బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

షటిల్ ఆడుతూ హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగి మృతి



భానుపురి/ సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రేడియోగ్రాఫర్ గా పనిచేస్తున్న వెలుగు కరుణాకర్ (60) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ షటిల్ గ్రౌండ్లో రాత్రి సెటిలాడుతూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు.సిపిఆర్ చేసిన చేయు దాటిపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే చనిపోయినట్లుగా ఆసుపత్రి వైద్యులు తెలిపారు.వీరు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులుగా సేవలు అందిస్తున్నాడు.

పట్టభద్రుల ఓటుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి భరోసా!

-ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు హెల్ప్‌డెస్క్ ప్రారంభం

భానుపురి /సూర్యాపేట టౌన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూపట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవసరమైన సహాయాన్ని అందించేందుకు హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు తమ వివరాల్లో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవడంతో పాటు, గతంలో ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో తిరిగి నమోదు చేసుకోవాల్సిన వారు కూడా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కొప్పుల వేణారెడ్డికోరారు.

సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణి చేసిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఇటీవల నియోజకవర్గం వ్యాప్తంగా పలు రకాల ప్రమాదాలు, అనారోగ్యంతో వైద్య సేవలు పొందిన 136 మంది లబ్ధిదారులకు సోమవారం అయన సంబంధిత చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుక్కడపు సక్కుబాయమ్మ కు నివాళులర్పించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



భానుపురి/ సూర్యాపేట ప్రతినిధి

ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ కుక్కడపు జానకి రామయ్య సతీమణి కుక్కడపు సక్కుబాయమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం మాజీమంత్రి జగదీష్ రెడ్డి వారి నివాసంలో వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమారుడు కుక్కడపు శ్రీనివాస్ నాయకులు మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మొరిశెట్టి శ్రీనివాస్, మీలా వంశీ, బండారు రాజా,ఉప్పల ఆనంద్, ముప్పారపు నాగేశ్వరరావు, బొమ్మిడి అశోక్, షీలా శంకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫోటో ట్రేడ్ షో పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

భానుపురి /సూర్యాపేట టౌన్

హైదరాబాద్ శంషాబాద్ లోని ఎస్ఎస్ కన్వెన్షన్ లో పీపీఐఎన్ డ ఫోటోటెక్ఆధ్వర్యంలో అక్టోబర్ 2, 3 డ 4 తేదీలలో నిర్వహించనున్న హైదరాబాద్ ఫోటో ట్రేడ్ షో పోస్టర్‌ను సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. ఫోటో, వీడియో రంగం రోజురోజుకూ అత్యాధునిక సాంకేతికతతో ముందుకు దూసుకుపోతుందని, అలాంటి నూతన టెక్నాలజీ, ఆధునిక కెమెరాలు, లెన్స్ లు, లైటింగ్ పరికరాలు, ఎడిటింగ్ సాఫ్ట్ వేర్లు, ప్రింటింగ్ సేవలను ఒకే వేదికపై పరిచయం చేసేందుకు ఈ ట్రేడ్ షో ఎంతగానో ఉపయోగ ˆపడుతుందని అన్నారు. ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వృత్తిలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ ట్రేడ్ షో విజయ వంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఫోటో రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలకు అండగా తమ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులోనూ ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఫోటో డ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం మాజీ కార్యదర్శి గుణగంటి సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఫోటో ట్రేడ్ షో ఇదేనని, దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కెమెరా కంపెనీలు, ల్యాబ్ పరికరాల సంస్థలు తమ స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. సూర్యాపేట జిల్లా నుంచి ఫోటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ షోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడి శ్రీనివాస్, హరినాథ్, ఐటిపాముల మల్లికార్జున్, శ్రీకాంత్, శేఖర్, శంకర్, నగేష్ మహేష్, కొచ్చర్ల రవి, నజీర్ బాయ్, రాము, నందిపాటి సైదులు, శశిరెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యుల సేవలో ఆర్య వైశ్య మిత్ర మండలి

భానుపురి /సూర్యాపేట టౌన్

పేద ఆర్యవైశ్యులకు సేవలందించడంలో ఆర్యవైశ్య మిత్రమండలి ముందు వరుసలో ఉంటూ పలువురికి సహాయం అందిస్తుంది. ఒక్క సూర్యాపేట వారికే కాకుండా ఇతర జిల్లాలో వారికి సైతం అడిగిన వెంటనే సహాయ సహకారాలు అందిస్తుంది. తాజాగా హైదరాబాద్ కు చెందిన ఇద్దరు మాటలు రాని దివ్యాంగులకు సహాయం అందించి తమ సేవ దృక్పధాన్ని చాటుకుంది. తదుపరి 10 రోజులు గడవకముందే సూర్యాపేట్ పబ్లిక్ స్కూల్లో 6 వ తరగతి చదువుతున్న ఆర్యవైశ్య విద్యార్థిని శ్రీరామ్ రామ్ షా కు తండ్రి మరణించడంతో తల్లి భవాని కుటుంబ భారాన్ని పోషిస్తుంది. కుటుంబ పరిస్థితి బాగా లేక పోవడం వలన స్కూల్ ఫీజు కట్టలేని పరిస్థుతులలో ఆర్యవైశ్య మిత్ర మండలి సభ్యులను కలిసి తమ పరిస్థితి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మిత్రులు కలకోట లక్ష్మయ్య, తప్పి గాంధి , పోతుగంటి వెంకటేశ్వర్లు , యామా ప్రభాకర్, వెంపటి శభరినాథ్ ఆధ్వర్యంలో మిత్రులు ఇతర మిత్రులకు తెలిపి 20,000/- రూపాయలు విరాళాలు సేకరించారు. సూర్యాపేట్ పబ్లిక్ స్కూల్ లో చదువుతున్న రామ్ షా స్కూల్ కరస్పాండెంట్ నరేష్ తో సంప్రదించి 33 వేల రూపాయల ఫీజులో 13 వేలు మాఫీ చేయించి 20 వేల రూపాయలు చెల్లించడం జరిగింది. పాఠశాల యాజమాన్యానికి ఆర్యవైశ్య ప్రముఖులు ధన్యవాదాలు తెలియజేశారు . ఇలాగే చదువు పట్ల ఆసక్తి ఉండి ఆర్దికంగా ఇబ్బందులు వున్నవారికి పట్టణంలోని ఆర్యవైశ్యులు అందరము కలిసి సహాయం చేస్తామని తెలియ జేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఫీజు కు ఆర్థిక సహాయం అందించిన బండారు రాజా, తప్పి గాంధీ, పొతుగంటి వెంకటేశ్వర్లు, కలకోట లక్ష్మయ్య , వెంపటి శబరినాథ్, యామ ప్రభాకర్, చల్లా సత్యనారాయణ కిరాణం, చిత్తలూరి శ్రీధర్, నీలా శ్రీనివాస్ (బ్యాంకు) గజ్జి నాగేందర్, మంచాల శీను , బోనగిరి భాస్కర్, బ్రాహ్మణపల్లి సంతోష్, బెలిదే రాజేష్, దారం శ్రీనివాస్, అఖిల జ్యువెలర్స్ ,యామ రామూర్తి, బుద్ధ శ్రీనువాసు కందగట్ల శ్రీను, ఓరు గంటి రామ మూర్తి , కందిబండ శ్రీనివాస్ , గుండా కరుణాకర్,చక్క లక్ష్మయ్య, గుడిపాటి కిరణ్ , మొరిశెట్టి సత్యనారాయణ (బంక్) బ్రహ్మదేవర సోమయ్య (చార్టెడ్ అకౌంటెంట్)యామ రవి కిరణ్ లకు ధన్యవాదములు తెలిపారు.

బుల్లెట్ ట్రైన్ సాధనలో ఆటో డ్రైవర్ల రిలే నిరాహార దీక్ష

భానుపురి /సూర్యాపేట టౌన్

బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65 సూర్యాపేట మీదుగా సాధించుకోవాలన్నా లక్ష్యంతో 70 రోజులుగా కొనసాగుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమశీ లో ఆటో డ్రైవర్లు దీక్షలో పాల్గొనడం అభినందనీయమని మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన దీక్షలో 46వ రోజు పట్టణ ఆటో డ్రైవర్ల సంఘం పాల్గొన గా మరి పూలమాలలు వేసి ఆహ్వానించారు. బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమంలో అన్ని వర్గాలు ముందుకొచ్చి తీవ్రతలు చేస్తేనే మనకిచ్చిన బుల్లెట్ రైలు మార్గం సిద్ధిస్తుందని అని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్షలో 46వ రోజు ఆటో డ్రైవర్లు శ్రీనివాస్ వీరేందర్ వెంకన్న సైదులు సొందుమియా, కిషన్, రాములు, నవీన్ చింతల నాని మహమూద్, సూర్య యాదయ్య వెంకన్న రాజు నగేష్ సూర్య యాదవ్ సంతోష్ పరమేష్ మల్లయ్య లో పాల్గొనగా, వీరిదీక్షకు సంఘీభావంగా, చలమల నరసింహ, వెలుగు వనిత, కిషన్ బాలకృష్ణ, బండారు రాజా, బిక్షం నారబోయిన కిరణ్, జర్నలిస్టు భూపతి రాములు ,కందుకూరు యాదగిరి, సట్టు నాగయ్య,శోభ, తన్నీరు వాసు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

భానుపురి/సూర్యాపేట టౌన్

షహీద్ భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్రన్న కుంట దగ్గర ఇండస్ హై స్కూల్ లో భగత్ సింగ్ 119వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఇండస్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడెల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ .. భగత్‌సింగ్ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప యువ సమరయోధుడని అన్నారు. ఆయనలో ఉన్న దేశభక్తి, ధైర్యం, చదువుపై ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సమానత్వం వంటి విలువలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక చైతన్యం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకొని, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చామల లచ్చయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు చామల అశోక్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు, అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని నిర్వాహకులు అభినందించారు. ఇండస్ హై స్కూల్ అధినేత చిట్లింకి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య మాజీ నాయకులు దంతాల రాంబాబు, బొమ్మగాని శ్రీనివాస్ బూర వెంకటేశ్వర్లు, నీల శ్రీనివాస్, గుగులోత్ రాజారాం, తొగిటి మురళి, ఇట్టమల్ల ఈశ్వర్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

భానుపురి /సూర్యాపేట టౌన్

ఏఐసీసీ పిలుపు, పీసీసీ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణి, సర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అవకతవకలను నిరసిస్తూ డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

శ్రీ వాసవి రక్షణ కవచం లో సభ్యులుగా చేరండి

భానుపురి /సూర్యాపేట టౌన్

శ్రీ వాసవి రక్షణ కవచములు లో సభ్యులుగా చేరాలని శ్రీ వాసవి రక్షణ కవచం నిర్వాహకులు బచ్చు పురుషోత్తం తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ శ్రీ వాసవి రక్షణ కవచం ద్వారా ఆర్యవైశ్యుల నుండి ప్రతినెల 100 రూపాయలు సేకరించి ప్రతినెల ఒక పేద ఆర్యవైశ్య కుటుంబానికి రూ. 10 వేల రూపాయల సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు శ్రీ వాసవి రక్షణ కవచం లో స్వచ్ఛం దంగా 190 మంది సభ్యులుగా భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. సూర్యాపేటకు చెందిన నీలా రాజ్యలక్ష్మి ప్రమాదవశాత్తు గాయాలు కావడంతో తొంటి ఆపరేషన్ నిమిత్తం రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. సుమారుగా 500 మంది సభ్యులుగా చేర్చి ప్రతినెల 50 వేల రూపాయలు 5 గురు పేద ఆర్యవైశ్యులకు సహాయం అందించటమే దిశగా ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాన ఉన్న ఆర్యవైశ్యులను సహాయం చేసేందుకు శ్రీ వాసవి రక్షణ కవచం లో ప్రతి ఒక్క ఆర్యవైశ్యుడు సభ్యులుగా చేరి సహకరించాలన్నారు. ఆసక్తి గలవారు సెల్: 9848022520 కు ఫోన్ పే చేయాలని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు

భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ నరసింహ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. దప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.